ఆస్తి పన్నుపై వడ్డీ మాఫీ

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం జీవో ఎంఎస్‌నెం. 34 ఎంఏ తేదీ 16-03-2023 ఉత్తర్వుల మేరకు రాష్ట్రంలో అన్ని నగరపాలక, పురపాలక సంఘాలలో ఆస్తి, ఖాళీ జాగా పన్నుల విషయంలో ఈ ఆర్థిక సంవత్సరం వరకు ఉన్న బకాయిలు, ఈ ఆర్థిక సంవత్సరం పన్నుపై విధించిన వడ్డీని వన్‌టైంగా మాఫీ చేయడం జరిగిందని నగర కమిషనర్ డాక్టర్ జె.అరుణ తెలిపారు. అయితే పన్ను చెల్లించవలసిన పన్ను చెల్లింపుదారులు బకాయి ఉన్న మొత్తాన్ని ఈ ఆర్థిక సంవత్సరంతో సహా ఒకేసారి ఈనెల 31వతేదీ లోపు చెల్లించినట్లైతేనే ఈ వడ్డీ మినహాయింపు వర్తిస్తుందన్నారు. కావున, ఆస్తి పన్ను చెల్లింపుదారులు, ఈ సదవకాశాన్ని సద్వినియోగం చేసుకొని వడ్డీ మినహాయింపు లబ్ధిని పొంది తమ ఆస్తి, ఖాళీ జాగా పన్ను బకాయిలని వడ్డీ లేకుండా రాయితీ పొందాలని సూచించారు. నగరపాలక సంస్థ కొత్తగా భార్‌కోడ్ విధానం ద్వారా ఆస్తి పనులు నేరుగా నగర పాలక సంస్థ ఖాతాల్లో జమ చేసేలా ఎక్కడి నుండైనా పన్నులు చెల్లించే వెసులుబాటు కల్పించిందని, సచివాలయాల్లో కూడా పన్నులు చెల్లించవచ్చన్నారు.

అత్యవసర వాహనాలకు సుస్తీ

- నిధులు, నిర్వహణలో సమస్యలు
- జీతాలందక ఉద్యోగుల అవస్థలు

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్:

ప్రమాదం, ఆరోగ్యం విషమించడంతో పాటు ఏ చిన్న ఆరోగ్య సమస్య వచ్చినా మొదట గుర్తుకువచ్చేది 108. ప్రమాదం సంభవించిందటే వెంటనే ఫోన్‌తీసుకొని 108కు కాల్ చేస్తాం. అష్టకష్టాలు పడుతూనే ప్రమాదస్థలానికి కూయికూయిమంటూ 108వాహనం క్షణాల్లో వస్తుంది. ఆపదలో ఉన్న ఎందర్నినో కాపాడుతున్న 108కు సుస్తీ చేసింది. కాలం చెల్లిన వాహనాలు, ఫిట్‌నెస్ లేని వాహనాలతో చాలీచాలని జీతాలు నెలల తరబడీ అందక 108 వాహనాల్లో పనిచేస్తున్న పైలెట్లు, నర్సులు, ఇతర సిబ్బంది అవస్థలు పడాల్సి వస్తోంది.

ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న 108, 104 వాహనాల పరిస్థితి జిల్లాలో అత్యంత దయనీయంగా తయారైంది. ఇందులో పనిచేస్తున్న ఉద్యోగులను కదిపితే కాలం చెల్లిన వాహనాలతో ప్రమాదం సంభవించిన సంఘటనా స్థలానికి చేరుకోవాలంటే నానా తంటాలు పడాల్సి వస్తోందంటున్నారు. నిరసనలు, ధర్నాలు, వినతులు ఇచ్చినా పట్టించుకోవడం లేదంటున్నారు. కనీసం వాహనాల మరమత్తులకు నిధలు కూడా మంజురు కావడం లేదంటున్నారు. ఫలితంగా కాలంచెల్లిన వాహనాలతో నెట్టుకురావాల్సి వస్తోందని 108 సిబ్బంది వాపోతున్నారు. ఇదే పరిస్థితి కొనసాగితే రాబోయే రోజుల్లో రోడ్లుపై 108 వాహనాల సంఖ్య తగ్గిపోతుందంటున్నారు. మరోవైపు సకాలంలో జీతాలు అందక 108 వాహనసేవలు అందిస్తున్న ఉద్యోగులు ఇబ్బందులు పడుతున్నామంటున్నారు.

చిత్తూరు జిల్లాలో 104 వాహనాలు 64 సేవలు అందిస్తున్నాయి. 2022-23మే వరకు 104 వాహనాల సేవలు 19,14,562 మంది పొందారు. 4,20,338 మంది మధుమేహం వ్యాధిగ్రస్తులు, 3,93,010 మంది రక్తపోటు వ్యాధిగ్రస్తులు, 0-5 లోపు చిన్నపిల్లలు 92,294 మంది, స్కూల్ పిల్లలు, గర్భిణీ స్త్రీలకు వైద్యసేవలు పొందారు. జిల్లాలోని 75 108 వాహనాలు 1,74,26 మంది వైద్యసేవలు పొందారు. 2,512 మంది గర్భిణీ స్త్రీలను సకాలంలో ఆసుపత్రులకు చేర్చారు. 6,110 మంది చిన్నచిన్న ప్రమాదాలు, ఘర్షణలో గాయపడిన వారితో పాటు అస్వస్థకు గురైన వారికి వైద్యసేవలందించాయి.

108 ప్రారంభించిన కొత్తలో (ఫైల్‌ఫొటో)

మరమ్మతులకు నోచుకోని వాహనాలు

జిల్లాలోని 108 వాహనాల్లో పదికి పైగా తగిన సామర్థ్యం లేకుండా తిరుగుతున్నట్లు తెలుస్తోంది. ఫిట్‌నెస్‌లేని వాహనాలను రోడ్లపైకి తీసుకొచ్చేందుకు పైలెట్లు ఇబ్బందులు పడుతున్నారు. కొన్ని వాహనాలు 80వేల నుంచి లక్ష కిలోమీటర్లు తిరిగేశాయి. ప్రమాదంలో ఉన్న వారిని అత్యంతవేగంతో ఆసుపత్రులకు చేర్చేందుకు సిబ్బంది శ్రమించాల్సి వస్తోంది. ఎక్కడైనా వాహనం మొరాయిస్తే సిబ్బంది తంటాలు వర్ణణాతీతం.

108 వాహనం ప్రమాదానికి గురైతే సిబ్బందే ఖర్చులు భరించాల్సి వస్తోందని పైలెట్లు చెబుతున్నారు. వాహనాలు కండిషన్‌పై ప్రస్తున్న డ్రైవర్లపై కక్షసాధింపులు తప్పడం లేదు. డ్యూటీలు ఇవ్వకుండా వేధిస్తున్నారు. వేతనాలతో పాటు తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ గతేడాది డిసెంబర్‌లో సమ్మె నోటిసు ఇచ్చారు. ధర్నాలు, నిరసనలు చేపట్టారు. సమ్మె నోటీసు ఇచ్చి రెండు నెలలు గడుస్తున్నా ప్రభుత్వం నుండీ 108 ఉద్యోగుల సమస్యల పరిష్కారదిశగా ఎలాంటి చర్యలు తీసుకోవడంలేదు. రెండునెలలుగా జీతాలు పెండింగ్ పెట్టడంతో కుటుంబ అవసరాల కోసం సిబ్బంది అప్పులు చేయాల్సి వస్తోంది.

టెండర్ ఎప్పుడు పిలుస్తారో...

108, 104 వాహనాల్లో కొన్ని కాలంచెల్లిన ఫిట్‌నెస్ లేకుండా నడుస్తున్నాయి. వీటిస్థానంలో కొత్త వాహనాల కొనుగోలు కోసం టెండర్ పిలవాల్సి ఉంది. ఈ మేరకు 108 మేనేజర్ ప్రభుత్వానికి నివేధిక సమర్పించినా జాప్యం జరగుతున్నట్లు సమాచారం. రాష్ట్రవ్యాప్తంగా 150 కొత్త వాహనాలకు టెండర్ పిలువనున్నట్లు 108 మేనేజర్ చెబుతున్నారు. జిల్లాకు కూడా పూర్తిగా ఫిట్‌నెస్ లేని వాహనాల స్థానంలో కొత్త వాహనాలు వచ్చే అవకాశమున్నట్లు చెబుతున్నారు. అయితే అప్పటి వరకు ఫిట్‌నెస్‌లేని పాత వాహనాలతో సిబ్బంది తంటాలు పడాల్సిందేనా అంటూ 108 సిబ్బంది ప్రభుత్వ తీరుపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

డిక్లరేషన్ అందుకుంటున్న ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్:

ఉమ్మడి ప్రకాశం, నెల్లూరు, చిత్తూరు నియోజకవర్గ పట్టభద్రుల శాసనమండలి ఎన్నికల్లో ప్రాధాన్యతా ప్రకారం ఓట్ల లెక్కింపులో కంచర్ల శ్రీకాంత్ గెలుపొందినట్లు ఎన్నికల కమిషన్ ప్రకటనతో డిక్లరేషన్ అందించడం జరిగిందని రిటర్నింగ్ అధికారి, చిత్తూరు జిల్లా కలెక్టర్ యం.హరినారాయణన్ తెలిపారు. శనివారం ఉదయం స్థానిక ఆర్‌విఎస్ ఇంజనీరింగ్ కళాశాలలో ఈనెల 16వ తేదీ నుంచి నిర్వహించిన కౌంటింగ్ ప్రక్రియ జరిగింది. ఈ మేరకు రిటర్నింగ్ అధికారి పట్టభద్రుల ఎన్నికల్లో గెలుపొందిన కంచర్ల శ్రీకాంత్‌కు డిక్లరేషన్‌ను అందించారు. 16న ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు ఉదయం 8 గంటల నుండి కౌంటింగ్ ప్రక్రియ ప్రారంభమైంది. 18న ఉదయం 2 గంటల వరకు కొనసాగిన ఎలిమినేషన్ ఓటింగ్ ప్రక్రియతో తన సమీప అభ్యర్థి శ్యామ్‌ప్రసాద్ రెడ్డి పేర్నాటిపై 34,110ఓట్ల ఆధిక్యంతో కంచర్ల శ్రీకాంత్ గెలుపొందడంతో ఎన్నికల కమిషన్ జారీ చేసిన డిక్లరేషన్‌ను అందుకున్నారు. ఎలిమినేషన్ కౌంటింగ్ ప్రాధాన్యతా ప్రక్రియ విధానంతో మొత్తం 2,48,360 ఓట్లకు గానూ కంచర్ల శ్రీకాంత్‌కు 1,24,181ఓట్లు, శ్యామ్‌ప్రసాద్ పెర్నాటికి 90,071 ఓట్లు రావడం జరిగిందని తెలిపారు. అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి, డిఆర్ఓ ఎన్.రాజశేఖర్ డిక్లరేషన్ అందించే కార్యక్రమంలో పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికల్లో గెలుపొందిన కంచర్ల శ్రీ కాంత్‌కు డిక్లరేషన్ ఇస్తున్న ఆర్ఓ హరినారాయణన్

కంచర్ల శ్రీకాంత్ చౌదరి, పట్టభద్రుల ఎమ్మెల్సీ బయోడేటా

పేరు : కంచర్ల శ్రీకాంత్ చౌదరి
తండ్రిపేరు : కంచర్ల రామయ్య
స్వగ్రామం : కందుకూరు
పుట్టినతేది : 25.7.1980
విద్యార్హతలు : బిటెక్, ఎంబిఏ 2005లో తిరుపతి ఎస్వీ యూనివర్సిటీలో బిటెక్, 2017లో తిరుపతి ఎస్వీ యూనివర్సిటీలో ఎంబీఏ పూర్తిచేశారు. 2018లో యూనివర్సిటీ ఆఫ్ ఆసియా నుంచి డాక్టరేట్ పొందారు.
ప్రస్తుతం : ప్రకాశం ఎడ్యుకేషన్ గ్రూప్‌డైరెక్టర్, కంచర్ల ఫౌండేషన్ ద్వారా అనేక సేవా కార్యక్రమాలు చేపడుతున్నారు.

వైఎస్సార్‌సీపీ పతనం ప్రారంభం

ఎంఎల్‌సి కంచర్ల శ్రీకాంత్

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: ఎంఎల్‌సి ఎన్నికల్లో టిడిపి ఘనవిజయంతో వైసిపి పతనం ప్రారంభమైందని ఎంఎల్‌సి కంచర్ల శ్రీకాంత్ అన్నారు. శనివారం స్థానిక టిడిపి జిల్లా పార్టీ కార్యాయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. అధికారపార్టీ ఎన్ని కుయుత్తులు పన్నినా టిడిపి విజయాన్ని అడ్డుకోలేకపోయిందని, ప్రజావ్యతిరేక పాలనకు నిదర్శనమన్నారు. యువత, నిరుద్యోగులు జగన్ పాలనపై కసితో ఓటు వేసి టిడిపికి ఘన విజయం కట్టుబెట్టారన్నారు. రానున్న ఎన్నికల్లోనూ టిడిపి విజయం సాధించడం ఖయమన్నారు. తన విజయాన్ని లోకేష్‌బాబుకు అంకితం ఇస్తున్నట్లు చెప్పారు. చంద్రబాబు విజన్‌ను యువత స్వాగతిస్తోందన్నారు. తెలుగుదేశం నాయకులు, కార్యకర్తల సమిష్టి కృషితో అధికారపార్టీ డబ్బులు పంపిణీ చేసినా విజయం సాధించామని ఇదే ఊపుతో రాబోయే అసెంబ్లిలో ఎన్నికల్లో విజయం సాధిస్తామని ధీమా వ్యక్తం చేశారు. చంద్రబాబు పాలనలో యువత ఉపాధికి కృషిచేస్తే జగన్ ఆలోచనలతో ఉన్న ఫ్యాక్టరీలు మూతపడ్డాయని కొత్త కంపెనీలు రావడం లేదన్నారు. రాష్ట్రంలో శాసనమండలి ఎన్నికల్లో టిడిపి విజయంతో అధికార పార్టీ అగడాలకు అడ్డుకట్ట పడిందన్నారు. సమావేశంలో తెలుగుదేశం నాయకులు దొరబాబు, పులివర్తి నాని, చంద్రప్రకాష్, మాజీ మేయర్ హేమలత, కోదండ యాదవ్, మోహన్‌రాజ్, సురేంద్ర కుమార్ పాల్గొన్నారు.

విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న పట్టభద్రుల ఎంఎల్‌సి కంచర్ల శ్రీకాంత్

నాడు- నేడు నిధులు రూ.1.56 కోట్లు విడుదల

సమావేశంలో మాట్లాడుతున్న ఎంఈఓ శ్రీదేవి

ప్రజాశక్తి- నగరి : మండలంలోని 61 పాఠశాలలకు రెండో విడత నాడు నేడు పథకంలో రూ.1.56కోట్ల రూపాయలు నిధులు మంజూరైనట్లు ఎంఈవో శ్రీదేవి వెల్లడించారు. శనివారం నాడు- నేడు పనులపై అధికారులు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లతోను, సీఆర్పీలతోను ఆమె సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈసమీక్ష సమావేశంలో పాఠశాలలకు మంజూరైన నిధులను ఏ విధంగా ఖర్చు పెట్టాలన్న అంశంపై నివేదిక సమర్పించాలని సూచించారు. టాయిలెట్ విత్ రన్నింగ్ వాటర్, సంపు, ఓవర్ హెడ్‌ట్యాంక్ పనులు విద్యార్థులకు అత్యవసరమని వీటికి మొదటి ప్రాధాన్యత కల్పించాలని సూచించారు. ఖర్చుపెట్టిన వాటికి వెంటనే బిల్లులు యాప్ నందు అప్లోడ్ చేయాలని డీఈ నరేష్ సూచించారు. పనులల్లో జాప్యం లేకుండా వెంటనే పూర్తి చేయాలని ఇంజనీరింగ్ అసిస్టెంట్లకు, సీఆర్పీలకు ఆదేశాలు జారీచేశారు.

విద్యార్థులు సేవాభావంతో ఎదగాలి : డీఈఓ

ప్రజాశక్తి- ఎస్ఆర్ పురం: విద్యార్థులు విద్యార్థి దశలో సేవాభావం క్రమశిక్షణను అలవర్చుకొని ఉత్తమ పౌరులుగా ఎదగాలని, సేవాభవాని పెంపొందించుకోవాలని చిత్తూరు డీఈఓ విజయేంద్రరావు అన్నారు. శనివారం మండలంలోని కొత్తపల్లి గ్రామ పంచాయతీ 49 కొత్తపల్లిమిట్ట విజయవాణి హైస్కూల్‌లో పాఠశాల కరస్పాండెంట్ వెంకటాద్రి నాయుడు ప్రధానోపాధ్యాయురాలు రజిని ఉపాధ్యాయ బందంతో కలిసి పాఠశాల వార్షికోత్సవాన్ని నిర్వహించారు. ఈకార్యక్రమానికి ముఖ్యఅతిథిగా డీఈఓ విజయేంద్రరావు పాల్గొన్నారు. డీఈఓ మాట్లాడుతూ... విద్యార్థులు విద్యార్థిదశలో సేవాభావం క్రమశిక్షణ అలవర్చుకొని ఉత్తమ పౌరులుగా ఎదగాలని అన్నారు. అలాగే ఆటపోటీలలో గెలుపొందిన విద్యార్థులకు స్కూలు యాజమాన్యం బహుమతులు ప్రధానం చేసింది. విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత శిఖరం ఎదగాలని తల్లిదండ్రులకు కీర్తిప్రతిష్ట తేవాలని మండల విద్యాధికారి అరుణాచల రెడ్డి అన్నారు. కార్యక్రమంలో కింగ్స్‌స్కూల్ కరస్పాండెంట్ రాజు, ఎస్వి కాలేజ్ ఛైర్మన్ గంగాధరం, మాజీ సర్పంచ్ విజయబాబు, ఎస్‌ఐ షేక్షావలి, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

డీఈఓని సన్మానిస్తున్న స్కూల్ కరస్పాండెంట్ వెంకటాద్రి నాయుడు

కందూరులో నేడు, రేపు గంగ జాతర

ప్రజాశక్తి - సోమల: మండలంలోని మేజర్ పంచాయతీ కేంద్రమైన కందూరు గ్రామంలో 19వ తేదీ ఆదివారం, 20వ తేదీ సోమవారం గంగజాతర నిర్వహించేందుకు గ్రామపెద్దలు అన్ని ఏర్పాట్లను పూర్తి చేస్తున్నారు. గ్రామ నడిబొడ్డున ఉన్న చావిడి వద్ద అమ్మవారిని ఆదివారం సాయంత్రం ప్రతిష్టించి సోమవారం పొంగళ్ళు అమ్మవారికి సమర్పించి అదేరోజు సాయంత్రం అమ్మవారిని నిమజ్జనం చేయడం ఆనవాయితీగా వస్తోంది. పంచాయతీ సర్పంచ్ బాషా మసూద్ కార్యదర్శి జయశంకర్ల ఆధ్వర్యంలో గ్రామంలో కూడా జాతర సందర్భంగా పారిశుద్ధ కార్యక్రమాలను ముమ్మరంగా చేపట్టి గ్రామాన్ని పరిశుద్ధ గ్రామంగా తీర్చిదిద్దుతున్నారు.

ఇక కార్పొరేట్ దే రాజ్యం

ప్రజాదృష్టి

ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో

విద్యావ్యవస్థ పరిరక్షణ కోసం ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులు, ఉపాధ్యాయ సంఘాలు పోరాటాల రూపంలోనూ, శాసనమండలిలోనూ 'పీడీఎఫ్' తరపున పోరాడుతూనే ఉన్నారు. గత 16 ఏళ్లుగా ప్రభుత్వ విద్యాసంస్థలు బాగున్నాయంటే పీడీఎఫ్ ఎంఎల్‌సిలే కారణం. తాజాగా జరిగిన ఎంఎల్‌సి ఉపాధ్యాయ ఎన్నికల్లో కుతంత్రాలతో 'వైసిపి' చేజిక్కించుకుంది. కార్పొరేట్ విద్యాసంస్థలను బలపరిచింది. ఇక వాళ్లుచెప్పిందే వేదం. ఉపాధ్యాయులకు ఏ సమస్య వచ్చినా గతంలో పీడీఎఫ్ ఎంఎల్‌సిలకు తమ గోడు విన్నవించుకునేవారు. వారి సమస్యలను శాసనమండలిలో ప్రస్తావనకు తెచ్చేవారు. విశ్లేషణాత్మకమైన చర్చ జరిగేది. విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్, ప్రభుత్వ బడుల పరిరక్షణలోనూ వీరు కీలకంగా వ్యవహరించేవారు. పిఆర్‌సి అమలు చేయాలని, సిపిఎస్ రద్దు చేసి ఒపిఎస్ ఇవ్వాలని, పోస్టులు భర్తీ చేయాలని పిడిఎఫ్ ఎంఎల్‌సిలు శాసనమండలిలో జగన్ సర్కార్‌ను నిలదీస్తూ వచ్చారు. 'చలో విజయవాడ' నిర్వహించి నిర్బంధాలను ఎదిరించి జగన్‌కు వణుకు పుట్టేలా చేశారు. పీడీఎఫ్ ఎంఎల్‌సిల అడ్డు తొలగించుకోవాలని జగన్ సర్కార్ కుట్ర పన్నింది. ఓ దశలో శాసనమండలినే రద్దు చేయాలని యోచించింది. తమ పార్టీ రాజకీయ నిరుద్యోగులకు అవకాశం కల్పించేందుకు ఆ నిర్ణయాన్ని వెనక్కి తీసుకుంది. ఎంఎల్‌సి ఎన్నికల్లో 'పీడీఎఫ్' భరతం పట్టాలని కక్షపూరితంగా జగన్ వ్యవహరించారు. ఓట్ల చేర్పింపు నుంచి అధికార యంత్రాంగానికి బాధ్యత అప్పగించారు. వాలంటీర్లను కార్యకర్తల్లా వాడుకున్నారు. వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఎంఎల్‌ఎలకు, ఎంపిలకు టార్గెట్లు ఇచ్చారు. 'ఎలాగైనా గెలిచి తీరాలి' అని హుకుం జారీ చేశారు. దీంతో అధినేత మన్ననలు పొందేందుకు వైఎస్ఆర్ కాంగ్రెస్ ప్రజాప్రతినిధులు దొంగ ఓట్లను చేర్పించడంలో పోటీ పడ్డారు. సక్సెస్ అయ్యారు. అయితే పీడీఎఫ్ కార్యకర్తలు, మీడియా జోక్యంతో వీరు చేర్పించినవి చాలావరకూ 'ఫేక్ ఓట్ల'ని తేల్చారు. పోలింగ్ రోజు రిగ్గింగ్‌కు సైతం పాల్పడ్డారు. గొడవలు సృష్టించేందుకు సిద్ధపడ్డారు. విందులు, వినోదాలు, ప్రలోభాల నడుమ ఓటర్లను ఆకట్టుకునే ప్రయత్నం చేశారు. కార్పొరేట్, ప్రైవేట్ స్కూళ్లపై కర్ర పెత్తనం చేశారు. ఓటుకు నోటు పేరుతో ఒక్కో కళాశాలకు, ప్రైవేట్ స్కూళ్లకు గుత్తగా 5-10 లక్షలు నజరానా ప్రకటించారు. ఒక్కో ప్రైవేట్ టీచర్‌కు ఐదువేల రూపాయల చొప్పున అందజేశారు. గిఫ్ట్ ప్యాక్‌లు పంపిణీ చేశారు. ప్రభుత్వ టీచర్లు మాత్రం అధికార పార్టీ గిఫ్ట్‌లను తిరస్కరించారు. తమ తరపున తమ పీడీఎఫ్ అభ్యర్థులే పెద్దల సభకు వెళతారని నికార్సుగా ఓటేశారు. కార్పొరేట్ యాజమాన్యాల కనుసన్నల్లో మెలిగిన ప్రైవేట్ టీచర్లు ఉద్యోగ భద్రత ఉండదని భయపడి వారు చెప్పినట్లే చేశారు. అయినా వైసిపి టీచర్ అభ్యర్థి పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి మొదటి ప్రాధాన్యత ఓటుతో గెలవలేకపోయారు. రెండో ప్రాధాన్యత ఓటు లెక్కింపుతో పీడీఎఫ్ అభ్యర్థి పొక్కిరెడ్డి బాబురెడ్డిపై 1055 మెజార్టీతో గట్టెక్కారు. ఏమైనప్పటికీ ప్రభుత్వ ఉపాధ్యాయుల సమస్యలపైనా, ప్రైవేట్ టీచర్ల సమస్యలపైనా పెద్దల సభలో గళమెత్తేవారు తూర్పు రాయలసీమలో లేకుండా పోయారు. ప్రతి ప్రభుత్వ ఉపాధ్యాయునిలోనూ ఇదే వేదన.

ఇకనైనా బుద్ధి తెచ్చుకోండి

వైసిపి నాయకులకు మాజీ మంత్రి అమరనాథరెడ్డి హితవు

పలమనేరులో..

ప్రజాశక్తి - పలమనేరు: తొమ్మిది జిల్లాలో వైసిపి పాలనపై ప్రజలు ఏమనుకుంటున్నారనేది శాసన మండలి ఎన్నికల్లో రుజువైందని, ఇకనైనా దౌర్జన్యాలు ఆపి బుద్ధి తెచ్చుకోవాలని వైసిపి మాజీ మంత్రి అమరనాథరెడ్డి హితవు పలికారు. శనివారం పట్టణంలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో విలేకర్ల సమావేశం ఏర్పాటు చేశారు. ఆయన మాట్లాడుతూ రాయలసీమ ప్రాంతంలో వైఎస్సార్‌సీపీకి తిరుగు లేదని చెప్పిన జగన్ మోహన్‌రెడ్డి మాటలు కనీసం ఆయన సొంత నియోజకవర్గంలో ఫలించలేదన్నారు. తూర్పు, పశ్చిమ రాయలసీమకు సంబంధించిన ఎమ్మెల్సీ ఎన్నికల్లో టిడిపి విజయ ఢంకా మోగించిందన్నారు. ఇది కేవలం ఒక ట్రైల్ మాత్రమేనని 2024లో దీనికి రెట్టింపుగా రాష్ట్రం మొత్తం సైకిల్ హవా నడుస్తుందని, ఫ్యాన్ సింగిల్ డిజిట్‌లో నిలిచిపోవడం ఖాయమని జోష్యం చెప్పారు. జిల్లాలో లోకేష్ బాబు యువగళం పాదయాత్ర జయప్రదం చేసిన ప్రతిఒక్కరికి హదయ పూర్వకమైన ధన్యవాదములు తెలిపారు. కార్యక్రమంలో ఆర్బీసీ కుట్టి గిరిబాబు, బీసీ సెల్ కార్యదర్శి సుబ్రహ్మణ్యం గౌడ్, మైనార్టీ సంఘం జిల్లా కార్యదర్శి ఖాజా, నదీమ్, చిన్ని పాల్గొన్నారు.

రామకుప్పం: రాష్ట్రంలో పట్టభద్రులు మూడు ఎమ్మెల్సీ స్థానాలను టిడిపి కైవాసం చేసుకున్నందుకు మండలంలో టిడిపి నేతలు, కార్యకర్తలు పెద్ద ఎత్తున సంబరాలు జరుపుకున్నారు. పార్టీ కార్యాలయం వద్ద స్వీట్స్ పంచుకున్నారు. చంద్రబాబు నాయుడు వ్యక్తిగత కార్యదర్శి మనోహర్, ఆనంద్‌రెడ్డి, ఆంజనేయులు రెడ్డి, మునస్వామి, నరసింహులు, కష్ణా నాయక్, గిరిదాస్, తదితరులు పాల్గొన్నారు.

రామకుప్పంలో..

బంగారుపాళ్యం నాయకులు

బంగారుపాళ్యం: పట్టభద్రుల ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ అభ్యర్థిగా పోటీచేసిన కంచర్ల శ్రీకాంత్ ఎమ్మెల్సీగా విజయం సాధించినందుకు శనివారం చిత్తూరు తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో మండల నాయకులు అభినందించారు. సర్పంచులు కోకప్రకాష్ నాయుడు, మురళి, ఉపాధ్యక్షులు కమలనాథరెడ్డి, కోదండ యాదవ్, రమేష్, చంద్రయ్య, మాణిక్యం పాల్గొన్నారు.

హోరెత్తిన టిడిపి సంబరాలు..!

ఎస్ఆర్‌పురం నాయకులు

ఎస్ఆర్‌పురం : తెలుగుదేశం పార్టీ మండలాధ్యక్షులు గంధమనేని జయశంకర్ నాయుడు ఆధ్వర్యంలో టిడిపి ఎమ్మెల్సీ అభ్యర్థి కంచర్ల శ్రీకాంత్ ఎమ్మెల్సీ ఎన్నికలలో గెలిచిన సందర్భంగా పుల్లూరు క్రాస్‌లో భారీగా బాణాసంచాలు పేల్చి స్వీట్లు పంచి, విజయోత్సవ సంబరాలు జరుపుకున్నారు. అనంతరం చిత్తూరులో ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్‌ను మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సన్మానించారు. వారి వెంట రాజశేఖర్ నాయుడు, మాధవ నాయుడు, గంధమనేని నరేష్ రామిరెడ్డి, పోన్న దాము రామిరెడ్డి, నిరంజన్ రెడ్డి, హేమాద్రి యాదవ్ కుమార్, కెఎం రవి తదితరులు పాల్గొన్నారు.

గంగాధర నెల్లూరు: పట్టభద్రుల ఎమ్మెల్సీలుగా శ్రీకాంత్, చిరంజీవి, రామ్‌గోపాల్ రెడ్డి విజయం సాధించడంపై శనివారం గంగాధరనెల్లూరు, తూగుండ్రం, ముసలయ్యగారిపల్లె భారీ ఎత్తున టపాకాయలు పేల్చి స్వీట్లు పంచుకుని సంబరాలు జరుపుకున్నారు. కష్ణమ నాయుడు, వెంకటేష్, శ్రీధర్ యాదవ్, స్వామిదాస్, దేవసుందరం, కోదండరెడ్డి, నియాజ్ అలీ పాల్గొన్నారు.

జిడి నెల్లూరులో..

వైసిపి ప్రభుత్వ విధానాలకు వ్యతిరేక తీర్పు

సిపిఎం జిల్లా కార్యదర్శి వాడ గంగరాజు

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్:

శాసనమండలి ఎన్నికల్లో మూడు పట్టభద్రుల నియోజకవర్గాల్లో విద్యావంతులు వైసిపి ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా ఇచ్చిన తీర్పును సిపిఎం స్వాగతిస్తోందని సిపిఎం జిల్లా కార్యదర్శి వాడ గంగరాజు శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. రాష్ట్రానికి ద్రోహం చేసిన బిజెపికి రాష్ట్ర ప్రజలు గట్టి గుణపాఠం చెప్పారని, అనర్హులను ఓటర్లుగా నమోదు చేయించడం మొదలు డబ్బు వెదజల్లడం, అధికార దుర్వినియోగం, దొంగ ఓట్లు వేయించడం వరకు అధికార వైసిపి పార్టీ అనేక అక్రమాలకు పాల్పడినా వారికి పరాజయం తప్పలేదని ఎద్దేవా చేశారు. ఉద్యోగులు, ఉపాధ్యాయులు, ఇతర శ్రమ జీవుల సమస్యలను పరిష్కరించలేదు సరికదా వారు సాగించిన ఉద్యమాలపై తీవ్ర నిర్బంధం విధించిందన్నారు. ప్రభుత్వ తీరుకు ప్రతిఘటనే పట్టభద్రుల తాజా తీర్పు. ప్రభుత్వ విధానాలకు నిరసనగాను, వాటికి వ్యతిరేకంగా సాగిస్తున్న ఉద్యమాల కొనసాగింపుగానే పట్టభద్రులు ఓటును వినియోగించారని, రానున్న రోజుల్లో మరిన్ని ఐక్య ఉద్యమాలను నిర్వహించి ప్రజాసమస్యలు పరిష్కరించేలా ప్రభుత్వం మెడలు వంచాలని పిలుపునిచ్చారు. అన్ని వర్గాలు, తరగతుల ప్రజానీకం పోరాటాలకు సన్నద్ధం కావాలని విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వం ఇప్పటికైనా తమ విధానాలపై పునరాలోచించి, ప్రజానుకూల చర్యలు చేపట్టాలని, నిర్బంధ వైఖరిని విడనాడాలని ఆయన డిమాండ్ చేశారు.

దెబ్బతిన్న పంట పరిశీలన

ప్రజాశక్తి- బైరెడ్డిపల్లి: మండలంలోని దేవదొడ్డి రైతు భరోసా కేంద్రం పరిధిలోని కుంటలవంక గ్రామంలో జిల్లా వ్యవసాయ అధికారి మురళికష్ణ క్షేత్రాస్థాయిలో రెండు రోజుల క్రితం పడిన అకాలవర్షం కారణంగా దెబ్బతిన్న పంటల పరిస్థితిని పరిశీలించారు. అలాగే బైరెడ్డిపల్లిలో ఎరువులు పురుగు మందుల దుకాణాలను తనిఖీ చేశారు. రైతులకు నాణ్యమైన విత్తనాలు, ఎరువులు, పురుగు మందులను అమ్మాలని అన్నారు. అనంతరం దేవదొడ్డి, గంగినయనపల్లి రైతు భరోసా కేంద్రలను తనిఖీ చేసి సిబ్బంది పనితీరును సమీక్షించారు. మండల వ్యవసాయాధికారి మునికష్ణ, వ్యవసాయ సహాయకులు పవన్, ఝూన్సీ రైతులు పాల్గొన్నారు

దెబ్బతిన్న పంటలను పరిశీలిస్తున్న మురళికృష్ణ

ఉపాధ్యాయులకు నిరంతరం

సేవలందించడమే యుటిఎఫ్ లక్ష్యం

ప్రజాశక్తి- కార్వేటినగరం: విద్యార్థులు భవిష్యత్తు నిర్దేశకులుగా తీర్చిదిద్దే ఉపాధ్యాయులకు నిరంతరం సేవలు అందించడమే లక్ష్యంగా యుటిఎఫ్ ఉపాధ్యాయ సంఘం పనిచేస్తోందనియుటిఎఫ్ సంఘం రాష్ట్రకార్యదర్శి ఎస్ఎస్.నాయుడు పేర్కొన్నారు. శనివారం కార్వేటినగరం ప్రధాన పాఠశాలలో యుటిఎఫ్ మండల అధ్యక్షుడు వేణుగోపాల్ ఆధ్వర్యంలో మండల కౌన్సిలింగ్ సమావేశంలో రాష్ట్ర ప్రధానకార్యదర్శి మాట్లాడుతూ అధ్యయనం, అధ్యాపనం, సామాజిక సహ అనే సిద్ధాంతంతో యుటిఎఫ్ ఉపాధ్యాయ సంఘం పని చేస్తోందని, సమకాలిన వ్యవస్థలో విద్యారంగ అభివద్ధికి మార్గదర్శకంగా నిలుస్తోందని కొనియాడారు. అనంతరం జిల్లా సహాధ్యక్షులు శ్రీదేవీ మాట్లాడుతూ నూతన విద్యావిధానం పేరుతో పాఠశాలల విలీనాన్ని మానుకోవాలని, పాఠశాలలను యథావిధిగా కొనసాగించాలని కోరారు. యుటిఎఫ్ జిల్లా కార్యదర్శులు శేఖర్, రూప మాట్లాడుతూ సీపీఎస్‌ను రద్దు చేసి పాతపెన్షన్ విధానాన్ని కొనసాగించాలని కోరారు. మండల కేంద్రంలో నిర్వహించిన మండల కౌన్సిలింగ్‌లో మండల యుటిఎఫ్ అధ్యక్షులుగా వేణుగోపాల్, ప్రధాన కార్యదర్శిగా సుబ్రమణ్యం ఏకగ్రీవంగా ఎంపిక చేసినట్లు రాష్ట్ర కార్యదర్శి ఎస్ఎస్ నాయుడు తెలిపారు. అలాగే గౌరవ అధ్యక్షులుగా నాధమునిరెడ్డి, సహాధ్యక్షులుగా జ్యోతి, దైవ శిఖామణి, కోశాధికారి సురేష్‌ను ఎంపిక చేసినట్లు ఆయన తెలిపారు.

సంతాన సాఫల్య కేంద్రం ప్రారంభం

ప్రజాశక్తి- పలమనేరు: పట్టణంలో ప్రముఖవైద్యులు యుగంధర్ తరంగిణి ఏర్పాటు చేసిన శ్రీ సాయిరాం మల్టీస్పెషాలిటీ ఆసుపత్రిలో జిల్లా డీసీసీబీ చైర్‌పర్సన్ రెడ్డమ్మ కష్ణమూర్తి సంతాన సాఫల్య కేంద్రాన్ని రిబ్బన్ కట్‌చేసి శనివారం ప్రారంభించారు. ఆమె మాట్లాడుతూ పిల్లలు లేని తల్లిదండ్రుల కొరకు సంతాన సాఫల్య కేంద్రాన్ని ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. ఇదివరకు సంతానం లేని తల్లిదండ్రులు బెంగళూరు, చెన్నై అంటూ వివిధ ప్రాంతాలకు ఎంతో ఖర్చు పెట్టుకుంటూ తిరిగేవాళ్లు ఇక అవసరం లేకుండా బెంగళూరు డాక్టర్ నూరి ఆధ్వర్యంలో పలమనేరులో ఏర్పాటు చేసినట్లు తెలిపారు. డాక్టర్ నూరి మాట్లాడుతూ పిల్లలు లేని తల్లిదండ్రులు ఈ అవకాశాన్ని ఉపయోగించుకోవాలని కోరారు. డాక్టర్ యుగంధర్ తరంగిణి మాట్లాడుతూ పలమనేరు చుట్టుపక్కల ప్రాంతాల ప్రజలు బిడ్డలు లేని దంపతులు తల్లిదండ్రులు కావాలనే తపనతో వివిధ ప్రాంతాలు తిరిగి చాలా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని మా దష్టికి వచ్చిందని వారికి మంచి చేయాలనే ఒక తలంపుతో ఈ సంతాన సాఫల్య కేంద్రాన్ని ఏర్పాటు చేశామన్నారు. ప్రస్తుతానికి ఉచితంగానే వారికి టెస్టులు చేస్తున్నామని తెలిపారు. వైసీపీ రాష్ట్ర కార్యదర్శి మొగసాల కష్ణమూర్తి, లక్ష్మీపతి, పలమనేరు మున్సిపల్ చైర్‌పర్సన్ పవిత్ర మురళికష్ణ, మురళీకష్ణ, బిఆర్‌సి కుమార్, బెంగళూరు డాక్టర్ల బందం, సాయిరాం మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రి డాక్టర్లు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సంతాన సాఫల్య కేంద్రాన్ని ప్రారంభిస్తున్న డిసిసిబి చైర్‌పర్సన్ రెడ్డమ్మ

క్యాన్సర్‌పై మహిళలకు అవగాహన అవసరం

వైద్య శిబిరంలో మాట్లాడుతున్న ఎంపీపీ సురేంద్రనాథ రెడ్డి

ప్రజాశక్తి- పులిచెర్ల: క్యాన్సర్ వ్యాధిపై ప్రతి మహిళకు అవగాహన అవసరమని ఎంపీపీ సురేంద్రనాథరెడ్డి, వైద్యాధికారులు రాజేష్‌రెడ్డి, నారాయణస్వామి, శ్రీనివాసులు తెలిపారు. మండలంలోని ఎల్లంకివారిపల్లిలో శనివారం పెద్దిరెడ్డి భాస్కర్‌రెడ్డి, కుంచె పద్మావతమ్మ మెమోరియల్ ట్రస్ట్ సంయుక్తంగా క్యాన్సర్‌పై ఉచిత అవగాహన స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించారు. ఈ క్యాన్సర్ వైద్యపరీక్షల శిబిరాన్ని ఎంపీపీ సురేంద్రనాధరెడ్డి ప్రారంభించారు. వారు మాట్లాడుతూ మహిళలకు క్యాన్సర్‌పై మరింత అవగాహనతో ముందుకెళితే వ్యాధినిర్మూలన సాధ్యమన్నారు. రొమ్ము క్యాన్సర్, గర్భాశయం క్యాన్సర్, నోటి క్యాన్సర్ తదితర సమస్యలపై మహిళలు పరీక్షలు నిర్వహించుకోవాలన్నారు. తిరుపతి శ్రీ వెంకటేశ్వర ఇనిస్టిట్యూట్ క్యాన్సర్ రీసెర్చ్ టాటా ట్రస్ట్ ఆధ్వర్యంలో క్యాన్సర్ చికిత్సలు నిర్వహించడం జరుగుతోందన్నారు. 30 నుంచి 60 ఏళ్ల మహిళలు తప్పనిసరిగా క్యాన్సర్ పరీక్షలు నిర్వహించుకోవాలని తెలిపారు. గ్రామీణ ప్రజలకు తిరుపతి అలిపిరి సమీపంలోని స్వీకార్ క్యాన్సర్ టాటాట్రస్ట్ సేవలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కుంచా లక్ష్మీపతి, సర్పంచ్ మునిరత్నం, ప్రోగ్రాం కో ఆర్డినేటర్లు హేమంత్ కుమార్, రెడ్డికుమారి, డాక్టర్ భార్గవ్, స్టాఫ్‌నర్సు అమరావతి, టెక్నీషియన్ చైతన్య, ప్రజలు పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణానికి స్థల పరిశీలన

దేవాలయం నిర్మాణం కోసం స్థల పరిశీలన చేస్తున్న సర్పంచ్

ప్రజాశక్తి-సోమల: కందూరు పంచాయతీ ఉలవలవారిపల్లె గ్రామంలో నూతనంగా నిర్మించనున్న దేవాలయం కోసం సర్పంచ్ భాష మసూద్ గ్రామస్తులు శనివారం స్థలపరిశీలన చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ గ్రామస్తులు ఐక్యంగా గుడి నిర్మాణం చేసుకోవాలన్న ఆలోచనతో స్థలపరిశీలన చేసి వారికి స్థలాన్ని కేటాయించడం జరిగిందని తెలిపారు. ఈక్రమంలో గ్రామంలో వీధిదీపాలు వెలగకపోవడంతో స్పందించిన సర్పంచ్ వీధిదీపాలను ఏర్పాటు చేయించారు. వీఆర్వో శ్రీనివాసులు, మహబూబ్ బాషా, జయశంకర్, రాజు తదితరులు పాల్గొన్నారు.

పులిమడుగులో పొలంబడి

ప్రజాశక్తి- బంగారుపాళ్యం: నాట్లు వేకముందు విత్తన శుద్ధి చేపట్టాలని జిల్లా సహాయ వ్యవసాయ సంచాలకులు మధుసూదన్ రెడ్డి అన్నారు. శనివారం మండలంలోని వెలుతురు చేను రైతు భరోసా కేంద్రంలో పులిమడుగు గ్రామంలో రైతు అన్నదొరై వరి పొలంలో ఆర్‌బికే సిబ్బందికి శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. సహాయ వ్యవసాయ సంచాలకులు మధుసూదన్‌రెడ్డి మాట్లాడుతూ పొలంబడి 100 హెక్టార్ల విస్తీర్ణంలో రాగిమానుపెంట, వెలుతురు చేను, కీరమంద, టేకుమంద ఆర్బి కేంద్రాల్లో రైతుల పొలాలలో నిర్వహిస్తున్నామని తెలిపారు. విత్తనశుద్ధి, వరి నారు కొనలు తుంచి నాటకం, కాలి బాటలు తీయడం, సమగ్ర ఎరువుల వాడకం, శత్రుమిత్ర పురుగులను గుర్తించి సస్యరక్షణ చేపట్టడం వంటి అంశాలపై అవగాహన నేర్చుకోవాలని అన్నారు. మండల వ్యవసాయ అధికారి పద్మజ మాట్లాడుతూ సాగుఖర్చు తగ్గించి అధిక దిగుబడి, అధిక ఆదాయం పొందవచ్చని ప్రత్యక్షంగా 14 వారాల పాటు ప్రతి పొలంబడిలో నందు 2 ఎకరాల విస్తీర్ణంలో ఒక రైతు పొలంలో చేయించడం ద్వారా మిగిలిన రైతులకు అవగాహన పెరుగుతుందన్నారు.

మాతాశిశు మరణాలను అరికట్టండి

సిహెచ్‌ఓ లక్ష్మీనారాయణ

ప్రజాశక్తి- యాదమరి: మాతాశిశు మరణాలు నిర్మూలించేందుకే వ్యాధినిరోధక టీకాల కార్యక్రమం అని జిల్లా ఆరోగ్య విద్యాఅధికారి గుణశేఖర్, యాదమరి కమ్యూనిటీ హెల్త్‌ఆఫీసర్ లక్ష్మీనారాయణ తెలిపారు. శనివారం యాదమరి ప్రాథమిక ఆరోగ్యకేంద్రం పరిధిలోని కమ్మారాయనమెట్ల గ్రామంలో జరుగుతున్న వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమాన్ని వారు తనిఖీ చేశారు. ఈసందర్భంగా మాట్లాడుతూ గ్రామీణప్రాంతాల్లో అధికసంఖ్యలో కాన్పు సమయాల్లో తల్లులు కాన్పు తర్వాత చిన్నారులు మతి చెందుతుండడాన్ని గుర్తించిన ప్రభుత్వం వీటిని పూర్తిగా నిర్మూలించేందుకే గ్రామీణ ప్రాంతాల్లో వ్యాధినిరోధక టీకాల కార్యక్రమాన్ని అమలు చేసిందన్నారు. ఏ ఒక్కరూ తప్పిపోకుండా 100శాతం వ్యాధినిరోధక టీకాలను గర్భవతులకు చిన్నారులకు అందించాలని తద్వారా మాతాశిశు మరణాలను సమూలంగా నిర్మూలించవచ్చని వారు సూచించారు. అలాగే చిన్నారులకు ఇచ్చే వ్యాధి నిరోధక టీకాలను పరిశీలించే సంతప్తిని వ్యక్తం చేశారు. అనంతరం పౌష్టికాహారం ప్రాధాన్యత గురించి వారికి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్వైజర్ లక్ష్మీపతి, హెల్త్‌అసిస్టెంట్ సురేంద్రరెడ్డి, ఎంఎల్‌హెచ్‌పి భానుప్రియ, ఏఎన్‌ఎం విజయకుమారి, ఆశా కుమారి పాల్గొన్నారు.

దాతలకు నిలయం కార్వేటినగరం

ఘనంగా 78వ వార్షికోత్సవం

మొదటి స్థానంలో నిలిచిన విద్యార్థిని తల్లిదండ్రులకు నగదు బహుమతిని అందిస్తున్న ఎంపీపీ లతబాలాజీ

ప్రజాశక్తి- కార్వేటినగరం : విద్యాభివృద్ధి కోసం ప్రోత్సాహించే దాతలకు నిలయం కార్వేటినగరం అని వైఎస్సార్సీపీ జిల్లా ప్రధానకార్యదర్శి బాలాజీ అన్నారు. శనివారం ఆర్కేఎస్సార్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల 76వ వార్షికోత్సవాన్ని హెచ్‌ఎం వసుతీదేవీ ఆధ్వర్యంలో ఘనంగా జరుపుకున్నారు. ఈసందర్భంగా బాలాజీ మాట్లాడుతూ విద్యార్థులను ప్రోత్సాహించడానికి దాతలు ముందుకు రావడం అభినందనీయమని కొనియాడారు. అనంతరం మండల పార్టీ కన్వీనర్ ధనంజయవర్మ మాట్లాడుతూ ఎందరో శాస్త్రవేతలుగా, ప్రభుత్వ ఉద్యోగులుగా తీర్చిదిద్దిన పాఠశాలలో విద్యనభ్యసించడం మన అదష్టమని అందరి హెచ్‌ఎం వైవీ వసుమతీదేవీ మాట్లాడుతూ 2022-23 విద్యాసంవత్సరంలో పదో తరగతిలో 570 మార్కులు సాధించి మొదటిస్థానంలో నిలిచిన హర్షవర్ధినికి రూ.40వేలు. 553 మార్కులు సాధించి రెండో స్థానంలో నిలిచిన హేమంత్‌కు రూ.15 వేలు ప్రోత్సాహక నగదును అందిస్తున్నట్లు పేర్కొన్నారు. అనంతరం విద్యార్థులు నిర్వహించి సాంస్కతిక కార్యక్రమాలు చూపరులను ఎంతో ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ఎంపీడీఓ మోహన మురళీ, పాఠశాల చైర్మన్ మోహన కుమారి, వైస్ చైర్మన్ సప్తగిరి, మండల కోఆప్షన్ మెంబర్ పట్నం ప్రభాకర్రెడ్డి పలువురు పాల్గొన్నారు.

నైతిక విలువలతో కూడిన క్రమశిక్షణ అవసరం

ప్రజాశక్తి-పెద్దపంజాణి: విద్యార్థి దశ నుంచే పిల్లల్లో నైతిక విలువలు, సమాజం పట్ల గౌరవం క్రమశిక్షణతో కూడిన విద్య అవసరమని మదర్ థెరిసా విద్యాసంస్థల అధినేత ఎం.రవీంద్రబాబు అన్నారు. శనివారం మండల పరిధిలోని మదర్‌థెరిసా పాఠశాలలో యూకేజీ విద్యార్థులకు గ్రాడ్యుయేషన్‌డేను ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా ఛైర్మన్ ఎం.రవీంద్రబాబు మాట్లాడుతూ విద్యార్థులకు క్రమశిక్షణతో కూడిన విద్యాబోధన అవసరమని, అప్పుడే సమాజంలో ఉన్నతంగా ఎదిగేందుకు దోహదపడుతుందని అన్నారు. ఉత్తమ విద్యార్థులుగా వారిని తీర్చిదిద్దాల్సిన బాధ్యత పాఠశాలలో ఉపాధ్యాయులతో పాటు ప్రతి తల్లిదండ్రులు తీసుకోవాలని సూచించారు. అనంతరం విద్యార్థులకు గ్రాడ్యుయేషన్ పత్రాలను అందించి అభినందించారు. కార్యక్రమంలో డైరెక్టర్ కుమారి శ్రేయ, డీన్ డాక్టర్ వై.మధుసూదన్ రెడ్డి, పాఠశాల ప్రిన్సిపాల్ డేవిడ్, ఉపాధ్యాయ బందం, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఉత్తమ ఫలితాలు సాధించడమే లక్ష్యం

హెచ్‌ఎం పి.వెంకటరమణ రెడ్డి



ప్రజాశక్తి- వెదురుకుప్పం: మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతున్న విద్యార్థులు మంచి శిక్షణ ఇచ్చి ఉత్తమ ఫలితాలు సాధించడమే లక్ష్యమని పాఠశాల ప్రధానోపాధ్యాయులు పి.వెంకటరమణరెడ్డి తెలిపారు. ఇకపై ఉదయం 7.30 గంటలకు ఇంటి నుంచి పాఠశాలకు వస్తే సాయంత్రం 5.30 గంటల వకు బడిలోనే ఉపాధ్యాయుల పర్యవేక్షణలో చదివిస్తున్నట్లు తెలిపారు. అంతేకాకుండా సాయంత్ర సమయంలో విద్యార్థులకు స్నాక్స్ కూడా అందిస్తున్నట్లు తెలిపారు. జిల్లా కలెక్టర్ సూచన మేరకు, ఎంఈఓ శంకరయ్య సలహాతో ఇ కార్యక్రమం చేపట్టినట్లు తెలిపారు. ఎస్‌ఎల్‌టిఏ జిల్లా అధ్యక్షులు దొడ్డ ఉమామహేశ్వరరావు స్నాక్స్‌పు అందించినట్లు తెలిపారు. మురళీరెడ్డి, భ్రమరాంబ, మునిరత్నం, శ్యామల, శ్రీనివాసులు, బండి ప్రభాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

చీటింగ్ కేసులో

ముద్దాయికి ఆరు నెలలు జైలు శిక్ష

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: ఓ అమ్మాయిని నమ్మించి మోసం చేసిన కేసులో కార్మికశాఖలో జూనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్న సుధీర్ కుమార్‌కు ఎక్సైజ్ కోర్టు న్యాయమూర్తి కె.రవి ఆరు నెలల జైలుశిక్ష విధిస్తూ శుక్రవారం తీర్పునిచ్చారు. వివరాల మేరకు కార్మికశాఖలో జూనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న సుధీర్‌కుమార్ ఐరాల మండలం పిఎన్‌ఆర్‌గారిపల్లెకు చెందిన ఓ యువతిని నమ్మించి మోసం చేశాడు. ఈమేరకు బాధితురాలు స్థానిక ఐరాల పోలీస్‌స్టేషన్లో 2013లో ఫిర్యాదు చేసింది. దీంతో సుధీర్ కుమార్, ధనలక్ష్మి మురళీ మోహన్ రాజశేఖర్‌పై 420 కేసు నమోదు చేశారు. సీసీ నెంబర్ 282 బార్ 2014 నాట్ నుంచి పది సంవత్సరాలు పాటు విచారించిన ఎక్సైజ్ కోర్టు నేరం నిరూపణ కావడంతో ఏ1 ముద్దాయిగా ఉన్న టి.సుధీర్ కుమార్‌కు 6 నెలలు జైలుశిక్ష, మరో ముగ్గురు ముద్దాయిలకు రూ.2000వేలు జరిమానా విధిస్తూ ఎక్సైజ్ కోర్టు న్యాయమూర్తి రవి శుక్రవారం తీర్పును వెలువరించారు.

యువతిని మోసం చేసిన కేసులో ఆరు నెలలు శిక్షపడ్డ సుధీర్ కుమార్

నాటుసారా కేసులో నిందితుడు అరెస్ట్

ప్రజాశక్తి- చౌడేపల్లె: నాటుసారా కేసులో నిందితుడిని శనివారం చౌడపల్లె పోలీసులు అరెస్ట్ చేశారు. ఎస్ఐ రవికుమార్ కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. పుంగనూరు నియోజకవర్గం మండలం, పాలెంపల్లి పంచాయతీ, జెడి.దిన్నెకు చెందిన ఆనంద్ నాయక్ (34) నాటుసారా విక్రయం కేసులో పరారీలో ఉన్నాడు. ఇదిలా ఉండగా శనివారం ఉదయం నిందితుడు గ్రామంలో సంచరిస్తున్నట్లు అందిన ముందస్తు సమాచారం మేరకు పోలీసులు తమ సిబ్బందితో వెళ్లి అరెస్టు చేశారు. అనంతరం నిందితుడిపై కేసు నమోదు చేసి రిమాండుకు తరలించినట్లు ఎస్ఐ తెలిపారు.

ఎనిమిది మంది పేకాట రాయుళ్లు అరెస్ట్

రూ.33 వేల నగదు స్వాధీనం

ప్రజాశక్తి- సోమల: మండలంలోని పేటూరు పంచాయతీ పోలికిమాకులపల్లి గ్రామానికి సమీపంలోని కావమ్మబండ వద్ద పేకాట ఆడుతున్నారన్న సమాచారం మేరకు సోమల పోలీసు సిబ్బంది మెరుపు దాడి చేశారు. ఈ దాడిలో ఎనిమిది మంది పోలీసులకు పట్టుబడగా ఇద్దరు పరారయ్యారు. వారి వద్ద నుండి రూ.33000 నగదును స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసి ఎనిమిది మందిని అరెస్టు చేసినట్టు పోలీసులు తెలిపారు.

ఆస్పత్రిలో చేర్చి పరారయ్యాడు

ప్రజాశక్తి- నగరి: నగరి ఏరియా ఆస్పత్రికి శుక్రవారం రాత్రి అనారోగ్యంతో ఉన్న ఒక వ్యక్తిని మరో వ్యక్తి వెంటబెటుకొని వచ్చాడు. ఆయాసంతో ఉన్నాడని చికిత్స అందించాలని చెప్పి ఇన్‌పేషంట్‌గా చేర్పించాడు. ఆస్పత్రి సిబ్బంది వివరాలు అడిగితే చికిత్సకు వచ్చిన వ్యక్తిపేరు సురేష్(28) అని అతని తండ్రి పేరు రామూర్తి అని తెలిపాడు. తాము తమిళనాడు, షోళింఘర్ నుంచి వచ్చామని వివరాలు నమోదు చేయించాడు. 94901 86238 ఫోన్ నెంబరు వివరాల కింద నమోదు చేశాడు. సురేష్‌కు వైద్యులు వైద్యం అందిస్తుండగా ఎవరికీ చెప్పకుండా పరారయ్యాడు. అప్పటికే పూర్తిస్థాయి అనారోగ్యంతో ఉన్న సురేష్ శనివారం ఉదయం మతి చెందాడు. అతనితో పాటు వచ్చిన వ్యక్తి లేకపోవడంతో ఆస్పత్రి సిబ్బంది పేషంట్ వివరాల్లో ఉన్న ఫోన్ నెంబరుకు ఫోన్‌చేశారు. అయితే ఆ నెంబరుకు సర్వీసులు నిలిపియేబడ్డాయన్న సమాచారం మాత్రమే వస్తోంది. దీంతో ఆస్పత్రి సిబ్బంది పోలీసులకు సమాచారం అందించి మతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మార్చురీకి తరలించారు. విషయం తెలుసుకుని ఆస్పత్రికి వచ్చిన ఎస్ఐ శివశంకర్ వివరాలను ఆరాతీశారు. మతదేహాన్ని పరిశీలించగా మతుని చేతిపై తమిళ అక్షరాలలో పళని అని ఉందన్నారు. దీంతో ఆస్పత్రిలో ఇచ్చిన వివరాలు సరైనవా లేవా అన్న సందేహాన్ని పోలీసులు వ్యక్తం చేస్తున్నారు. తమిళనాడు, షోళింగర్‌కు వివరాలు పంపి మతుని తరపువారి కోసం గాలిస్తున్నామన్నారు.

మృతుడి ఫొటో

సంక్షిప్త వార్తలు

ఎల్ఈడి బల్బ్ తయారీపై అవగాహన

ప్రజాశక్తి- గంగవరం: మదర్ థెరిసా విద్యాసంస్థల ఆధ్వర్యంలో శనివారం తమిళనాడు క్రిష్ణగిరి చెందిన ప్రణవ్ సొల్యూషన్ సమస్థ వారితో కలిసి ఎల్‌ఈడీ బలుపు తయారు చేసే విధానం, అవి ఎలా పనిచేస్తాయి, వాటి వలన ప్రయోజనాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించినట్లు కళాశాల కరస్పాండెంట్ రవీంద్రబాబు తెలిపారు. ఈకార్యక్రమం బీటెక్ చదువుతున్న విద్యార్థులు, సైన్స్ అండ్ హ్యూమానటీస్ విద్యార్థులు కలసి పాల్గొన్నట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో ఎండి ఇలవర్షసన్, కళాశాల ఛైర్మన్ సునీల్‌బాబు, అదమిక్ అధికారి రాజేందర్ రెడ్డి, కళాశాల సిబ్బంది విద్యార్థులు పాల్గొన్నారు.

మహిళలకు ఆర్‌జివి క్షమాపణ చెప్పాలి

ఐద్వా జిల్లా కన్వీనర్ భువనేశ్వరి

ప్రజాశక్తి- బైరెడ్డిపల్లి: విద్యార్థులకు సత్ప్రవర్తన, సమాజ స్పహ బోధించాల్సిన నాగార్జున విశ్వవిద్యాలయంలో రాంగోపాల్‌వర్మ చేసిన వ్యాఖ్యలు విద్యార్థులను పక్కదారి పట్టిచెలా వున్నాయని ఐద్వా జిల్లా కన్వీనర్ భువనేశ్వరి శనివారం ఒక ప్రకటనలో ఖండించారు. ఆమె మాట్లాడుతూ రాం గోపాల్ వర్మ మహిళలను కించపరుస్తూ మాట్లాడదాన్ని ఆమె తీవ్రంగా వ్యతిరేకించారు. వర్మ దష్టిలో మహిళలు కేవలం శృంగారం కోసం మాత్రమేనని మాట్లాడటం మహిళలను కించపరచడమే అని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇంత నడుస్తున్నా యూనివర్సిటీ యాజమాన్యం ఖండించక పోగా వర్మ గొప్పథాత్వికుడు అని అందరూ అతన్ని అనుసరించాలని విద్యార్థులకు చెప్పడం సిగ్గుచేటు అన్నారు. వర్మ మహిళా లోకానికి క్షమాపణ చెప్పాలని, యూనివర్సిటీ యాజమాన్యం, వీసీలపై చట్ట పరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

'15 సూత్రాలు' అమలు చేయాలి

జాతీయ మైనార్టీస్ కమిషన్ సలహాదారులు

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: మైనారిటీల సంక్షేమ కోసం కేంద్ర మైనార్టీ సంక్షేమశాఖ రూపొందించిన ప్రధానమంత్రి 15 సూత్రాల కార్యక్రమాన్ని అన్ని జిల్లాలలో అమలు చేయాలని జాతీయ మైనార్టీస్ కమిషన్ సలహాదారు అర్షద్ అయుబ్‌ఖాన్ శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో నూతనంగా ఏర్పడిన జిల్లాలలో కమిటీలను నియమించలేదని, నియమించని కారణంగా మైనార్టీ వర్గాల కోసం కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పలు సంక్షేమ పథకాలను కోల్పోయే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయన్నారు. రాష్ట్రంలోని మైనార్టీ సంక్షేమశాఖ అధికారులు దీనిపై శ్రద్ధ పెట్టాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఇప్పటికే జిల్లాలలో కమిటీలను వెంటనే ఏర్పాటు చేయాలని రాష్ట్ర మైనార్టీ సంక్షేమ శాఖ సెక్రటరీ అన్ని జిల్లాల కలెక్టర్లకు లేఖలు రాశారు. ఈకార్యక్రమంపై జాతీయ మైనారిటీస్ కమిషన్ అన్ని రాష్ట్రాల మైనార్టీ సంక్షేమశాఖ అధికారులతో రివ్యూ మీటింగ్ త్వరలో నిర్వహించనున్నారు. జాతీయ మైనారిటీస్ కమిషన్ ప్రాధాన్యత అంశాలు అందరికీ విద్య, ఉపాధి, మైనార్టీ వర్గాల సంక్షేమం అమలు చేయాలని కోరారు.

ప్రతి విద్యార్థీ ఉన్నతస్థాయికి ఎదగాలి

ప్రజాశక్తి- శాంతిపురం: ప్రతివిద్యార్థీ కష్టపడి చదివి ఉన్నతశిఖరాలను అధిరోహించాలని తహశీల్దార్ లోకేశ్వరరావు అన్నారు. శనివారం మండల కేంద్రంలోని వివేకానంద పాఠశాల వార్షికోత్సవం జరిగింది. ఈకార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ విద్యార్థులు ఆటలతోపాటు చదువుకు కూడా ప్రాధాన్యత ఇవ్వాలని అన్నారు. అనంతరం పాఠశాలలో నిర్వహించిన వార్షిక క్రీడల్లో గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఎంఈఓ చంద్రశేఖర్, పాఠశాల కరస్పాండెంట్ ఆశా శంకరప్ప, ప్రధానోపాధ్యాయురాలు అమ్ము మాలతి, ఉపాధ్యాయుడు ఆనంద్, విద్యార్థులు తల్లితండ్రులు తదితరులు పాల్గొన్నారు.

విద్యా సామగ్రి, కుర్చీలు వితరణ

ప్రజాశక్తి- యాదమరి: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం పాఠశాలకు ఇన్ఫినిటీ ఫిన్‌కార్ప్ సొల్యూషన్ ప్రైవేట్ లిమిటెడ్ ముంబై వారిచే పాఠశాలకు అవసరమైన దాదాపు లక్ష రూపాయల విలువ చేసే కుర్చీలు, విద్యార్థులకు అవసరమైన విద్యాసామగ్రిని ఉచితంగా అందజేయడం జరిగింది. సంస్థ సీఈవో, మేనేజింగ్ డైరెక్టర్ శ్రీకాంత్ రావల్కర్, చిత్తూరు ఆఫీసు హెడ్ మోహన్, ఏసిఎన్ శివ, ఏఎస్‌ఎంలు వినాయక్‌రెడ్డి, లీలా ప్రసాద్‌లు కార్యక్రమంలో పాల్గొని పాఠశాల ప్రధానోపాధ్యాయులకు వితరణ వస్తువులు అందజేశారు. ఈ సందర్భంగా దాత మాట్లాడుతూ విద్యార్థులందరూ విద్యలో రాణించి ఉన్నతమైన స్థానాలు సాధించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు గిరిరాజా ఉపాధ్యాయులు కష్ణారెడ్డి, రవి, వెంకటరమణ, లక్ష్మీప్రసాద్, సుగుణ, సరస్వతి పాల్గొన్నారు.

జాతీయ స్థాయి ప్రోగ్రాంలో డిగ్రీ కళాశాల విద్యార్థిని

ప్రజాశక్తి- వెదురుకుప్పం: ఇటీవల కనూర్ విశ్వవిద్యాలయం కేరళలో నిర్వహించిన నేషనల్ ఇంటిగ్రేషన్ క్యాంప్‌లో ఆంధ్రప్రదేశ్ తరపున ప్రోగ్రామ్ ఆఫీసర్‌గా డాక్టర్ వైయస్సార్ గవర్నమెంట్ డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ అధికారి డాక్టర్ సి.మంగళ గౌరీ పాల్గొన్నారు. వారితో పాటు వివిధ కళాశాలలో చదువుతున్న ఐదుగురు బాలికలు, ఐదుగురు బాలురు కూడా పాల్గొనడం జరిగింది. ఐదుగురు బాలికలలో డాక్టర్ వైయస్సార్ గవర్నమెంట్ డిగ్రీ కళాశాలలో బీకాం రెండో సంవత్సరం చదువుతున్న ఎన్.రేవతి ఒకరుగా ఎన్నుకోవడం జరిగింది. క్యాంప్‌లో పాల్గొని కళాశాలకు పేరు తెచ్చినందుకు ప్రిన్సిపాల్ డాక్టర్ బి.అన్నపూర్ణ శారద, ఎన్ఎస్ఎస్ అధికారిని, వాలంటీర్ ఎన్.రేవతిని శుక్రవారం అభినందించారు.

పారిశుధ్య కార్మికులకు దుస్తులు పంపిణీ

ప్రజాశక్తి -సోమల: మండలంలోని మేజర్ పంచాయతీ కేంద్రమైన కందూరు సర్పంచ్ భాషా మసూద్, పంచాయతీ కార్యదర్శి జయశంకర్ పంచాయతీ కార్మికులకు దుస్తులను పంపిణీ చేశారు. శనివారం స్థానిక సచివాలయంలో ఈకార్యక్రమాన్ని నిర్వహించారు. మెకానిక్ భాష, మస్తాన్, పంచాయతీ కార్మికులు పాల్గొన్నారు.

టీకాలు తప్పక వేయించాలి

ప్రజాశక్తి- బైరెడ్డిపల్లి: మిషన్ ఇంద్రధనస్సు కార్యక్రమంలో భాగంగా వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమంలో డ్రాప్‌అవుట్ పిల్లల టీకాల కొరకు జిల్లా మాస్ మీడియా అధికారి జయరాముడు బైరెడ్డిపల్లి, తీర్థం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా మాస్‌మీడియా అధికారి జయరాముడు మాట్లాడుతూ చిన్నారుల ఆరోగ్యరక్షణకు వ్యాధి నిరోధక టీకాలు సకాలంలో తప్పక వేయాలన్నారు. బురిశెట్టిపల్లి గ్రామంలో ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమంలో పాల్గొని అన్ని సేవలు పరిశీలించారు. కార్యక్రమంలో డాక్టర్ విజయ చందర్, హెల్త్ ఎడ్యుకేటర్లు సావిత్రి శ్రీదేవి, సూపర్వైజర్లు ఎర్రంరెడ్డి, ఏఎన్ఎం రమా సుశీల, ఎంఎల్‌హెచ్ పి.మౌనిక, రేవతి ఆశాలు పాల్గొన్నారు.

వ్యాక్సినేషన్ ప్రక్రియను పరిశీలిస్తున్న జయరాముడు

గేట్ పుత్తూరులో పాము కలకలం

ప్రజాశక్తి-పుత్తూరు టౌన్: పట్టణంలోని గేట్ పుత్తూరు దాసరిగుంట వీధిలోని ఓ ఇంటిలో ఐదు అడుగుల జర్రిపోతు కలకలం రేపింది. శనివారం సాయంత్రం ఇంటి యజమాని పామును గుర్తించి భయభ్రాంతు లకు గురై స్థానికుల సహాయంతో అటవీ శాఖ సిబ్బంది స్నేక్ శ్రీకాంత్ కు సమాచారం అందించారు. దీంతో శ్రీకాంత్ పామును చాకచక్యంగా పట్టుకొని అడవిప్రాం తంలో వదిలాడు. అనంతరం ఇంటి యజమాని, గ్రామస్థులు ఊపిరి పీల్చుకున్నారు.